

గణేశ్ నవరాత్రులు..నిమజ్జనోత్సవాల కోసం ట్యాంక్‌బండ్ ముస్తాబవుతున్నది. ఇందులోభాగంగా ప్రత్యేకంగా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు.


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

I | హైదరాబాద్, శనివారం 31 ఆగస్టు 2024 | HYDERABAD


## హైడ్రా పేరిట డ్రామా

### మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



మహేశ్వరం: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయలేక.. రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో చేయలేక.. 'హైడ్రా' పేరిట డ్రామా ఆడుతున్నదని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. మహేశ్వరం మండల కేంద్రంలో కందుకూరు, మహేశ్వరం, బాలాపూర్ వ్యవసాయ అధికారులతో రుణమాఫీపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుబంధు డబ్బులే రుణమాఫీకి మార్చారని, అది కూడా పూర్తి స్థాయిలో ఎవరికీ ఇవ్వలేదన్నారు. ప్రజలకు సమాధానం చెప్పలేక కొత్త నాటకాలకు తెరలేపుతున్నారన్నారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. మహేశ్వరంలో వ్యవసాయాధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించామని, రుణ మాఫీ లెక్కలు అడిగితే వారి వద్ద సమాచారం లేదన్నారు.

# ఛిద్రమవుతున్న విద్యా కుసుమాలు

## నిర్దేశిత సమయాన్ని తప్పించి.. సిటీలోకి భారీ వాహనాలు

### విద్యార్థుల ప్రాణాలు తీస్తున్న వైనం
### పోలీసుల నిర్లక్ష్యం.. సమన్వయలోపం
### పలు కుటుంబాల్లో తీరని విషాదం

**సమన్వయలోపం.. నిర్లక్ష్యం.. వెరసి..నిండు నూరేండ్ల విద్యా కుసుమాల జీవితాలు అర్ధాంతరంగా ముగిసిపోతున్నాయి.. పలు కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతున్నాయి. ఉదయం..సాయంత్రం వేళల్లో పాఠశాలల ప్రారంభం..ముగింపు సమయాల్లో భారీ వాహనాలు రోడ్లపైకి రాకుండా చూడాల్సిన బాధ్యత పోలీసులది. ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ట్రాఫిక్ వ్యవస్థ పూర్తిగా గాడితప్పుతున్నది. ఫలితంగా రోడ్డు ప్రమాదాలు.. విద్యార్థుల ప్రాణాలను హరిస్తున్నాయి.. కన్నవారికి కడుపుకోతను మిగిలిస్తున్నాయి.**

**-సిటీబ్యూరో, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ)**

నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకొని భారీ వాహనాలను ఉదయం నుంచి రాత్రి వరకు సిటీ లోపలి ప్రాంతాలకు అనుమతించొద్దు. మినీ వాహనాలకు మధ్యాహ్నం వేళల్లో కొంత సడలింపునిస్తున్నారు. అయితే ఈ నిబంధన మూడు కమిషనరేట్ల పరిధిలో పకడ్బందీగా అమలు కావడం లేదు. యథేచ్ఛగా సిటీలోకి ఎప్పుడు పడితే అప్పుడు భారీ వాహనాలు ప్రవేశిస్తున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాలలు ప్రారంభం, ముగింపు సమయంలో భారీ వాహనాలు రోడ్లపైకి రావడం వల్ల ప్రమాదాలు జరుగుతాయనే ఆలోచన కూడా పోలీసులు చేయడం లేదు. రాచకొండ, హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యం వల్లే పది రోజుల వ్యవధిలోనే హబ్సిగూడలో ఇద్దరు విద్యార్థులు రోడ్డు ప్రమాదంలో మృత్యువాతపడ్డారంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. ఔటర్ రింగ్‌రోడ్డును పరిగణలోకి తీసుకొని సైబరాబాద్‌లో ఉదయం 7 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు భారీ వాహనాలు నగరంలోకి రావద్దని గతంలో నోటిఫికేషన్ జారీ అయ్యింది. అయితే ట్రాఫిక్ క్రమబద్ధీకరణను పక్కన పెట్టి కేవలం చలాన్లను వేయడమే పనిగా ట్రాఫిక్ విభాగం పనిచేస్తుందనే విమర్శలున్నాయి.

### కట్టుదిట్టమైన చర్యలేవి..?


పోలీసులు రోడ్డు ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం లేదు. పరిశ్రమలు ఎక్కువగా ఉండే ఉప్పల్, ఈసీఐఎల్, నాచారం తదితర ప్రాంతాల్లో లారీలు తిరుగుంటాయి. భారీ వాహనాలకు నిర్ణీత సమయం ఉండటంతో ఆ టైం ముగుస్తుందనే భావనతో లారీ డ్రైవర్లు వెనుకా ముందు చూసుకోకుండా అతివేగంగా నిర్లక్ష్యంగా వెళ్తుంటారు. ఆ సమయంలో రోడ్లపై ట్రాఫిక్ పోలీసులు ఉన్నా, వాటి గురించి పట్టించుకునే వారు ఉండరు. హబ్సిగూడ ప్రాంతంలో 10 రోజుల వ్యవధిలో ఇద్దరు విద్యార్థులు మృత్యువాత పడ్డారు. ఈ రెండు ప్రమాదాలకు లారీ డ్రైవర్ల నిర్లక్ష్యమే కారణం.

### పది రోజుల వ్యవధిలోనే..

గురువారం మధ్యాహ్నం 3.45 నిమిషాల ప్రాంతంలో పాఠశాల నుంచి తన పిల్లలను స్కూటీపై తీసుకొని సంతోషి ఇంటికి బయలుదేరారు. హబ్సిగూడలో వెనుక నుంచి వచ్చిన లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొడుతూ ముందుకెళ్లింది. దీంతో వెనుక కూర్చున్న సంతోషి పెద్ద కూతురు కామేశ్వరీ కిందపడటంతో లారీ చక్రాల కింద పడి తీవ్రగాయాలతో మృతి చెందింది. ఈ నెల 17న ఉదయం పాఠశాలకు పదో తరగతి చదువుతున్న రంగ సాత్విక ఆటోలో స్కూల్‌కు బయలుదేరింది. తార్నాక వైపు నుంచి వచ్చిన లారీ ఆమె వెళ్తున్న ఆటోను వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఆటో ముందున్న బస్సు కిందకు దూసుకుపోయింది. ఆటోలో ఉన్న ఆ విద్యార్థి మృతి చెందగా, ఆటో డ్రైవర్ ఎల్లయ్యకు తీవ్ర గాయాలయ్యాయి.

### మాదంటే..మాదికాదంటూ..

ఉప్పల్ నుంచి వచ్చిన లారీని రాచకొండలో ఆపాల్సిందని రాచకొండ పోలీసులు అంటుండగా, సికింద్రాబాద్ వైపు నుంచి వచ్చిన లారీని హైదరాబాద్ పోలీసులు ఆపలేదని ఒకరిపై ఒకరు సమస్యను నెట్టేసుకుంటున్నారు. అయితే ఈ విషయంపై రాచకొండ ట్రాఫిక్ డీసీపీ మనోహర్‌తో మాట్లాడగా, రాచకొండలో భారీ వాహనాలను ఎంట్రీ కాకుండా మరిన్ని కఠిన ఆంక్షలు విధించనున్నామని, ఈ విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్తున్నామని వెల్లడించారు.







# అత్యాధునికంగా ఉస్మానియా

### గోషామహల్ స్టేడియంలో పర్యటించిన కలెక్టర్ అనుదీప్

*గోషామహల్ పోలీస్ స్టేడియం ప్రాంతంలో కార్పొరేట్‌కు దీటుగా, తెలంగాణకే రోల్ మోడల్‌గా, అన్ని హంగులతో ఉస్మానియా దవాఖానను నిర్మించనున్నట్లు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పేర్కొన్నారు. శుక్రవారం గోషామహల్ ప్రాంతంలో బైక్‌పై పర్యటించి పరిశీలించారు. గోషామహల్ పోలీస్ స్టేడియంలోని 31 ఎకరాల 39 గుంటల స్థలంతో పాటు మ్యాప్‌ను ఆయన పరిశీలించి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఉస్మానియా దవాఖాన కొత్త భవనాన్ని అన్ని సదుపాయాలతో వందేండ్లకు ఉపయోగ పడేలా నిర్మిస్తామన్నారు. పోలీస్ అకాడమీ, అలాగే అనుబంధ శాఖలను పేట్ల బుర్జులోని పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ కేంద్రానికి మారుస్తామని కలెక్టర్ తెలిపారు.*

*- సిటీబ్యూరో/అబిడ్స్, ఆగస్టు 30*

### 'ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి'

గోషామహల్ పోలీస్ స్టేడియంలో ఉస్మానియా దవాఖాన నిర్మించాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఆనంద్‌కుమార్ గౌడ్ కోరారు. ఈ ప్రాంతంలో హాస్పిటల్‌ను నిర్మిస్తే వాతావరణం కలుషితమై ప్రజలు తీవ్ర అనారోగ్యం పాలయ్యే ప్రమాదముందన్నారు.

### సంతకాల సేకరణ

జనావాసాల మధ్య గోషామహల్ పోలీస్ స్టేడియం స్థలంలో ఉస్మానియా దవాఖాన నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు వినోద్ యాదవ్, కోటి శైలేశ్ కురుమలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గోషామహల్‌తో పాటు పలు ప్రాంతాల్లో ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు.

## సూచనలిచ్చి.. పరిశీలించి

సిటీబ్యూరో: గ్రేటర్‌లో డెంగీ వంటి విష జ్వరాలు విజృంభిస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇప్పుడు పరిస్థితి చేయిదాటుతుండటంతో సర్కారు ఆలస్యంగా మేల్కొంది. ఈ క్రమంలోనే వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, ప్రజా వైద్యం సంచాలకులు డా.రవీందర్ నాయక్ గ్రేటర్ పరిధిలోని పలు ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. కమిషనర్ కర్ణన్ కొండాపూర్ జిల్లా దవాఖాన, చేవెళ్ల దవాఖానలను సందర్శించి అక్కడికి పరిస్థితులను పరిశీలించారు. కొండాపూర్ దవాఖానలో రోగులను నిలబెట్టి చికిత్స అందించడం, వైద్యశాలలో చేరిన రోగులకు సకాలంలో వైద్యపరీక్షలు చేయకపోవడాన్ని తెలుసుకున్న కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు హెల్త్ డైరెక్టర్ డా.రవీందర్ నాయక్ శంషాబాద్, రాజేంద్రనగర్ సీహెచ్‌సీలను సందర్శించారు. అక్కడ అందుతున్న వైద్యసేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు.



హెల్త్ డైరెక్టర్ డా.రవీందర్ నాయక్

## కేబుల్స్ తొలగించండి

సిటీబ్యూరో, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్‌లో విద్యుత్ స్తంభాలపై ప్రమాదకరంగా ఉన్న కేబుల్స్‌ను వెంటనే తొలగించాలని, లేకుంటే సంస్థ పరంగా తగిన చర్యలు తీసుకుంటామని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. విద్యుత్ స్తంభాలపై ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేసిన ప్రైవేటు సంస్థల కేబుల్స్‌ను తొలగించాలని ఇదివరకే సంబంధిత సంస్థల యజమానులకు సూచనలు చేసినా.. స్పందించకపోవడంతో సీఎండీ మరో సారి దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. విద్యుత్ పోల్స్‌పై కేబుల్స్ ఎక్కువగా ఉండటం వల్ల బరువు ఎక్కువై స్తంభాలు వంగిపోతున్నాయని, తెగిపడిన కేబుల్స్ ఫుట్‌పాత్‌లపై చిందరవందర పడటం వల్ల పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారని ముషారఫ్ ఫరూఖీ తెలిపారు.



## పార్కిన్‌సన్ వ్యాధిగ్రస్తులకు ఆశా దీపం

### నిమ్స్‌లో మూవ్‌మెంట్ డిజార్డర్ క్లినిక్ ప్రారంభం

ఖైరతాబాద్: మెదడు, నరాల సంబంధిత వ్యాధుల్లో పార్కిన్‌సన్, డిస్టోనియా, సెరెబ్రల్ పాలసీ వ్యాధిగ్రస్తులకు నిమ్స్ ఆశా దీపంగా నిలిచింది. ఈ వ్యాధి వచ్చిన వారి కాళ్లు, చేతులు వణుకుతూ పట్టుతప్పుతాయి. ఈ క్రమంలో దైనందిన జీవితంలో తమ పనులను చేసుకునేందుకు వ్యాధిగ్రస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. అలాంటి వ్యాధిగ్రస్తుల కోసం నిమ్స్ దవాఖానలో మూవ్‌మెంట్ డిజార్డర్ క్లినిక్‌ను ఏర్పాటు చేశారు. ఈ క్లినిక్‌ను శుక్రవారం డైరెక్టర్ డాక్టర్ బీరప్ప ప్రారంభించారు. ఈ క్లినిక్‌లో అత్యాధునిక చికిత్స విధానాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిమ్స్ డీన్ డాక్టర్ లీజా రాజశేఖర్, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ శాంతివీర్, వైద్యులు రేష్మా తదితరులు పాల్గొన్నారు.






అధికారులకు సూచనలిస్తున్న పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్

## ఏందీ చెత్త

### అధికారులపై దానకిశోర్ ఆగ్రహం

#### రహదారికి ఇరువైపులా వ్యర్థాలు..

**పరిశుభ్రతపై అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**

సిటీబ్యూరో, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ) : పారిశుధ్యం, పరిశుభ్రతపై అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు తప్పవని పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ అధికారులను హెచ్చరించారు. గురువారం జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో హెచ్‌ఎండీఏ నిధులు రూ. 1.25 కోట్లతో బాల గార్డెన్ ఫంక్షన్‌హాల్ నుంచి గుర్రం చెరువు వరకు 800 మీటర్ల మేర నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పనులు పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ వాణి, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ వెంకన్నకు సూచించారు. అనంతరం చాంద్రాయణగుట్ట జోనల్ పరిధి గుర్రం చెరువు రోడ్డు మార్గాన్ని పరిశీలించారు. ఇష్టారీతిన పడి ఉన్న ఇరిగేషన్ శాఖకు చెందిన నీటి పైపులు, నిరుపయోగ ఉన్న మరుగుదొడ్లను వెంటనే తొలగించాలని సౌత్‌జోన్ కమిషనర్ వెంకన్న, చాంద్రాయణగుట్ట డీసీ సురేందర్‌ను ఆదేశించారు. రహదారికి ఇరువైపులా చెత్తాచెదారం, వ్యర్థాలు ఉండటంతో ఏమిటీ చెత్త అంటూ..దానకిశోర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే రోడ్డు మీదుగా బాలాపూర్ గణేశ్ నిమజ్జన ఊరేగింపు జరుగనున్న నేపథ్యంలో పారిశుధ్యం, పరిశుభ్రతపై అలసత్వం చేస్తే సహించేది లేదన్నారు. ఈ మార్గంలో పెండింగ్‌లో ఉన్న సీసీ, బీటీ రోడ్డు నిర్మాణ పనులను మిషన్ మోడ్‌లో చేపట్టి పూర్తి చేయాలన్నారు.

# బెదిరింపులు.. సెటిల్‌మెంట్లు

## మాఫియా తరహాలో కలరింగ్ • నరేశ్ దందాలు.. ఇంతింత కాదు

### బీహార్ నుంచి నాటు తుపాకీ.. వంద బుల్లెట్లు కొనుగోలు
### గాజులరామారం కాల్పుల ఘటనలో 15 మంది రిమాండ్.. ఆయుధాలు స్వాధీనం

**తనకంటూ..గుర్తింపు రావాలని..** లగ్జరీ జీవితాన్ని అనుభవించాలనే అత్యాశతో మాఫీయాకు తెరలేపేలా స్కెచ్ వేశాడు..అనుచరులనూ ఏర్పాటు చేసుకున్నాడు.. తనకున్న పరిచయంతో ఓ నాటు తుపాకీ.. వంద బుల్లెట్లను బీహార్ నుంచి కొనుగోలు చేశాడు. బెదిరింపులు.. ల్యాండ్ సెటిల్‌మెంట్లకు దిగి రియాల్టర్‌గా అవతారమెత్తాడు... ఇదీ కాల్పుల ఘటనలో పోలీసులకు చిక్కి..జైలుపాలైన నరేశ్ బ్యాక్ గ్రౌండ్. సంచలనం సృష్టించిన గాజులరామారంలో నాటు తుపాకీతో గాల్లో కాల్పుల ఘటనలో ప్రధాన నిందితుడైన నరేశ్‌తో పాటు మరో 14 మందిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం బాలానగర్ జోన్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఇన్‌చార్జి డీసీపీ కోటిరెడ్డి నిందితులను మీడియా ముందు హాజరుపరిచి వివరాలను వెల్లడించారు. మరోవైపు నరేశ్ నుంచి ఇబ్బందులుపడ్డ బాధితులు కొందరు పోలీసులకు ఫోన్లు చేసి..తమ గోడును వెల్లబోసుకున్నారు.

**-కుత్బుల్లాపూర్, ఆగస్టు 30**

ఈ నెల 28న రాత్రి 1.30 గంటల ప్రాంతంలో సీహెచ్. పూర్ణిమ(35)తో పాటు అజయ్‌చంద్ర(28), గౌతమ్(24) ముగ్గురు కలిసి మల్లంపేట్ నుంచి స్కూటీపై గాజులరామారం వైపునకు వస్తున్నారు. మార్గమధ్యలో ఎల్‌ఎన్ బార్ అండ్ రెస్టారెంట్ వద్ద పెట్రోల్ అయిపోయింది. బార్ మూసి ఉండటంతో దాని ఎదురుగా ఉన్న బైక్ కనిపించింది. అందులో నుంచి గౌతమ్ దాని పెట్రోల్ దొంగతనం చేస్తుండగా, అప్పుడే బార్ నుంచి బయటకు వచ్చిన అఖిలేష్ అనే వ్యక్తి గమనించాడు. పెట్రోల్ ఎందుకు దొంగలిస్తున్నావంటూ మందలించాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. బార్‌లో పని చేసే మిగతా వర్కర్లు కూడా బయటకు రావడంతో ఘర్షణ ముదిరింది. దూరంగా ఉన్న పూర్ణిమ వెంటనే నరేశ్, శివకు ఫోన్ చేసి.. గౌతమ్‌తో ఎవరో గొడవపడుతున్నారని తనకు భయంగా ఉన్నదని.. తొందరగా రావాలని చెప్పింది. ఈ క్రమంలో నరేశ్, శివ వాహనంలో అక్కడి చేరుకున్నారు. నరేశ్ అనుచరులు సోహెల్, శ్యాంసన్, నరేందర్, ఉజ్వల్ మరో వాహనంలో వచ్చారు. వచ్చిరాగానే నరేశ్ అనుచరులు బార్‌కి చెందిన అఖిలేశ్, నిశాంత్, బార్ వర్కర్లతో గొడవ పడుతున్న సమయంలో నరేశ్ ఆదేశాల మేరకు శివ తన దగ్గర ఉన్న నాటు తుపాకీతో గాల్లో కాల్చాడు. భయంతో బార్‌లో పని చేసే అఖిలేశ్, నిశాంత్, వర్కర్లు పారిపోతుండగా, మరోసారి శివ అఖిలేశ్ వైపునకు కాల్పులు జరిపాడు. అఖిలేశ్ తప్పించుకొని బార్ వెనక వైపునకు పరిగెత్తాడు. కారును నరేశ్ అతివేగంతో నిశాంత్ మీదకు దూసుకెళ్లగా కారు ముందు భాగం తగలడంతో అతడి కాళ్లు, ఎడమచేతికి తీవ్రగాయాలై చెట్లలో పడిపోయాడు. వేగంగా ముందుకెళ్లిన కారు చెట్ల మధ్యలో ఇరుక్కుపోయింది. ఈ ఘటనపై నరేశ్ తన అనుచరులు అదే రోజు రాత్రి జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ వద్దకు వచ్చి బార్‌లో పని చేసే వారిపై అజయ్‌చంద్రతో ఫిర్యాదు చేయించి వెళ్లిపోయారు. ఆ తర్వాత రోజు ఉదయం బార్‌లో పని చేసే అఖిలేశ్ స్థానిక జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కాల్పుల విషయం బయటకు రావడంతో పోలీసులు రంగంలోకి దిగారు. పరారీలో ఉన్న నరేశ్‌ను కూకట్‌పల్లిలో పట్టుబడటంతో పాటు అతడి అనుచరులను అదుపులోకి తీసుకొని విచారించగా, ఈ గ్యాంగ్ దందాలు బయటకు వచ్చాయి.

### నరేశ్‌పై ఆరు కేసులు..

పలు దందాలు చేసిన నరేశ్‌పై దుండిగల్ పీఎస్‌లో ఐదు, సంగారెడ్డి పీఎస్‌లో ఒక కేసు నమోదైంది. కొందరు బాధితులు పోలీసులకు ఫోన్లు చేసి..తమ గోడును వెల్లబోసుకున్నారు. విచారణలో నరేశ్ భూదందాలు, సెటిల్‌మెంట్లు, బెదింపులకు పాల్పడుతుండేవాడని తేలింది. పోలీసులు మొత్తం 15 మందిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి నాటు తుపాకీ, 87 బుల్లెట్లు, వాహనాలను సీజ్ చేసినట్లు డీసీపీ కోటిరెడ్డి వెల్లడించారు.






నిందితులను మీడియా ముందు హాజరుపరిచి వివరాలు వెల్లడిస్తున్న బాలానగర్ ఇన్‌చార్జి డీసీపీ కోటిరెడ్డి , స్వాధీనం చేసుకున్న ఆయుధాలు